తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల  కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శనివారం
18 ఏప్రిల్ 2026
పేజీలు : 8



## వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

○ ఆయుష్ సేవలపై ప్రత్యేక దృష్టి ○యోగా కేంద్రాల ఏర్పాటు పరిశీలన
○ హెచ్‌పీవీ టీకా కార్యక్రమం వేగవంతం చేయాలి ○2 నెలల్లో 6 వేల లక్ష్యం
○ ఆర్బీఎస్‌కే బృందాల ద్వారా పిల్లల ఆరోగ్య పరీక్షలు
○ గర్భిణీలకు ప్రత్యేక సంరక్షణ - ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రోత్సాహం



**పెద్దపల్లి,ఏప్రిల్ 17(జనంసాక్షి) :** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆయుష్ ఆసుపత్రుల పనితీరును పరిశీలించిన కలెక్టర్, ఆయుర్వేదం, హోమియోపతి సేవలపై ప్రజల స్పందన, రోజువారీ ఓపీ సంఖ్య వివరాలు తెలుసుకున్నారు. యోగా కేంద్రాల ఏర్పాటు కోసం స్థలాల లభ్యతపై పరిశీలించాలని సూచించారు. అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎక్స్-రే, 2డీ ఎకో యంత్రాల పనితీరును పరిశీలిస్తూ రోజువారీ పరీక్షల సంఖ్య పెంచాలని, ప్రజలకు ఎక్కువ సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. **మిగతా 9లో**

## ధాన్యం, పసుపు, మొక్కజొన్న కొనుగోళ్ల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 17 జనంసాక్షి :** రైతుల ప్రయోజనార్ధం జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ, పసుపు, మొక్కజొన్న కొనుగోళ్ళ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ధాన్యం, మొక్కజొన్న, పసుపు విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462-220183 నెంబర్ కు సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. ప్రతి రోజు ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు కంట్రోల్ రూమ్ పని చేస్తుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు కంట్రోల్ రూమ్ లో అందుబాటులో ఉంటారని, రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, వరి ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ కోసం రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ లు 1967కు లేదా 180042500333 కు రైతులు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, ఏఎస్ఓ అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ముఖ్యమంత్రిని,తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు



**సుల్తానాబాద్,ఏప్రిల్ 17(జనంసాక్షి) :** ఢిల్లీ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు,ఇతర ఎమ్మెల్యేలు, సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాజ్య సభ సభ్యులు వేం నరేందర్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,తదితరులు ఉన్నారు.



## విద్యా వికాస్ కళాశాల విద్యార్థులను అభినందించిన బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**బోధన్, ఏప్రిల్ 17 ( జనంసాక్షి ) :** ఇంటర్మీడియట్ ఫలితాలలో విజయ దుందుభి మోగించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యా వికాస్ విద్యార్థులను బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సన్మానించారు. చక్కటి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుతూ బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యా వికాస్ కళాశాల చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి

○ ప్రతి నివాస ప్రాంతానికి శుద్ధి జలాలు సరఫరా జరగాలి
○ అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 17 జనంసాక్షి:** వేసవి సీజన్ దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని డొంకేశ్వర్, నందిపేట్, మాక్లూర్, ఆలూర్, ఆర్మూర్ మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎం.పీ.ఓ లు, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులతో కలెక్టర్ మంచినీటి సరఫరా తీరుతెన్నులపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలంలోని ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతు పనులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వేసవిలో ఏయే ప్రాంతాలలో దాహార్తి సమస్యలు ఉత్పన్నం అయ్యాయని ఆరా తీశారు. ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల సరిపడా వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నందున, తాగునీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికాబద్దంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. చుక్క నీరు కూడా వృధా కాకుండా చూడాలని, చివరి ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాలలోని నివాసాలకు సైతం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ముందుగానే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని, సకాలంలో పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని అన్నారు. ఈ వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి నెలకొనకుండా అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా మంచినీటి కోసం ప్రజలు నిరసనకు దిగితే, సంబంధిత ఎం.పీ.డీ.ఓలను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులతో సమన్వయాన్ని పెంపొందించుకుని, ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డులలో ప్రజల అవసరాలకు సరిపడా పూర్తి స్థాయిలో రక్షిత మంచినీటి సరఫరా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. చేతి పంపులు, బోరు బావులకు తక్షణమే ఫ్లషింగ్ చేయించాలని అన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఆటంకం కలిగేలా పైప్ లైన్లను ధ్వంసం చేయడం, వాల్వ్ లకు నష్టం చేకూర్చే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఎంపీఓలు, ఏ.ఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వర్, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఏ.ఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి అవార్డు అందుకున్న మిలీనియం స్కూల్స్

## స్కూల్ చైర్మన్ మున్సిపల్ తిరుపతిరెడ్డి




**జమ్మికుంట, ఏప్రిల్ 17 (జనం సాక్షి):** ప్రసిద్ధ విద్యా సంస్థ అయిన లీడ్ నిర్వహించిన "శిక్ష అవార్డ్స్" లో భాగంగా సంస్థ రూపొందించిన కరికులం ఆధారంగా దేశంలోని అనేక పాఠశాలలను సమీక్షించి ఆ కరికులాన్ని అత్యుత్తమంగా అమలు చేసిన స్కూళ్లను ఎంపిక చేసి ఈ అవార్డులను అందజేస్తారు. ఈ క్రమంలో జమ్మికుంట పట్టణంలోని మిలీనియం స్కూల్ జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి "శిక్ష అవార్డు" ను సొంతం చేసుకుంది. ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం నోవోటేల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మిలీనియం స్కూల్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మున్సిపట్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ విజయానికి ప్రధాన కారణం స్కూల్స్ ప్రిన్సిపాల్స్, టీచర్లు, సిబ్బంది, విద్యార్థుల కృషి అని తెలిపారు. ప్రతి ఒక్కరి అంకితభావం, క్రమశిక్షణ, నాణ్యమైన బోధన విధానాల వల్లే ఈ గౌరవం సాధ్యమైందని పేర్కొన్నారు. అదేవిధంగా మా మిలీనియం స్కూల్ ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా అప్డేటెడ్ వెర్షన్‌లో ముందుకు సాగుతూ ఆధునిక విద్య, విధానాలను అమలు చేస్తోందన్నారు. మిలీనియం స్కూల్ ఎల్లప్పుడూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తూ, ఆధునిక బోధన విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగుతోందని, ఈ అవార్డు, స్కూల్ నాణ్యతకు, బోధనలో ఉన్న ప్రతిభకు మరో గుర్తింపుగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో విజయాలను సాధిస్తూ విద్యా రంగంలో మిలీనియం స్కూల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్స్ వరుణ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం ర్యాలీ



**ఎడపల్లి, ఏప్రిల్ 17 ( జనంసాక్షి ):** ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో శుక్రవారం ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని రాజశ్రీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన పాటు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని రాజశ్రీ మాట్లాడుతూ, 14 సంవత్సరాలలోపు బాలికలకు క్యాన్సర్ ను నిరోధించే హెచ్ పి వి వ్యాక్సిన్ గురించి వివరించారు. హిమోఫిలియా వ్యాధి వల్ల వచ్చే అనర్థాలు నివారణ ఉపాయాలను ఆమె వివరించారు. ప్రస్తుత ఎండాకాలంలో వడదెబ్బ బారిన విద్యార్థులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైతం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని రాజశ్రీ వివరించారు. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా టీబీ ఏ విధంగా వ్యాపిస్తుందో దాని నివారణ ఏవిధంగా చేపట్టాలో అనే అంశాలను పిల్లలకు వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి పరిశుభ్రంగా ఉండాలని ఈ మేరకు గాలి ద్వారా, నీటి ద్వారా వచ్చే వ్యాధుల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవికుమార్, బోధన్ ఉప వైద్య అధికారిని డాక్టర్ సమత, ఎడపల్లి వైద్యులు డాక్టర్ వినీత్ రెడ్డి, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫోటో వీడియో గ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా రాచర్ల వేణు కుమార్

**గంభీరావుపేట ఏప్రిల్ 17(జనం సాక్షి);** గంభీరావుపేట మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాచర్ల వేణు కుమార్ ఉధ్యక్షుడిగా దుంపటి సాయి కుమార్, కోశాధికారిగా గుమ్మల రాజు, ప్రచార కర్తగా రాచర్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాచర్ల వేణు కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వృత్తిపరంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, ఫోటోగ్రఫీ రంగాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఫోటో మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొని, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఆదర్శ తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా అల్లి భాస్కర్ ఎన్నిక

### ఉపాధ్యక్షులుగా కాశరాజు అనంతరాములు
### కోశాధికారిగా అల్లి సదానందం



**చిగురుమామిడి ఏప్రిల్17 (జనంసాక్షి);** తాపీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, హక్కుల సాధన కోసం నిరంతరం పనిచేస్తామని తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడు అల్లి భాస్కర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన ఆదర్శ తాపీ కార్మిక సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా అల్లి భాస్కర్ ను మూడవసారి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కాశరాజు అనంతరాములు, కోశాధికారిగా అల్లి సదానందంను, గౌరవ అధ్యక్షులుగా పోన్నం రవీందర్, సలహాదారుడుగా జిల్లెల భగవాన్ ప్రసాద్ లను ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడటానికి, వేతనాల పెంపు కోసం, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సభ్యత్వం ఇప్పించి, ప్రభుత్వ పథకాలను(ప్రమాద బీమా, వైద్య సహాయం, పిల్లల చదువుకు స్కాలర్‌షిప్‌లు) అందేలా కృషి చేస్తానన్నారు. తాపీ కార్మిక సంఘంలో దాదాపు 40మంది కార్మికులు ఉన్నారని, సభ్యత్వలను మరింత పెంచుతామని చెప్పారు. అల్లి భాస్కర్ మూడోసారి ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు అల్లి సదానందం, కూరపాటి లింగమూర్తి, మ్యాదరి సంపత్, పొన్నం సంపత్, కాశరాజు ఆంజనేయులు, చల్లూరి సదానందం, గూడెం రాజు, చల్లూరు నర్సయ్య, ఎర్ర శ్రీనివాస్, బండారిపల్లె స్వామీ, ఏల్పుల సతీష్, జిల్లెల సది, జిల్లేల రాజు, బెజ్జంకి కుమారస్వామి, పెనుకుల సదానందం, తమ్మల రాములు, బెజ్జంకీ సంపత్, బెజ్జంకీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీరు రాక ఇబ్బంది

**గంభీరావుపేట ఏప్రిల్ 17(జనం సాక్షి);** గంభీరావుపేట మండల కేంద్రంలోని రెండో, మూడు వార్డులకు సంబంధించిబోరు మోటర్ కాలిపోవడంతో మోటర్ మెకానిక్ షాప్ కు తరలించి 15 రోజులు అవుతున్న పట్టించుకోని వార్డు సభ్యులు మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రెండో వార్డ్ మరియు మూడో వార్డు ప్రజలకు ఆ బోరు యొక్క నీరు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. 15 రోజులు క్రితం బోరు మోటఈర్ కాలిపోయి రిపేరుకు తరలించి 15 రోజులు అవుతున్న ఇప్పటివరకు వార్డ్ సభ్యులు పట్టించుకోవడం లేదు అని కొందరు వార్డు ప్రజలు అంటున్నారు. ప్రజలు వార్డు సభ్యులను అడగగా, బోరు ప్రెస్సింగ్ చేయించేది ఉందని, అందుకే బోరుమోటర్ బిగించడం లేట్ అవుతుందని అన్నారు.. రెండోవార్డ్ సభ్యుడు చిలుక ప్రశాంత్ మూడో వార్డు సభ్యుడు ఏగ దండి స్వామి ని వివరణ కోరగా రెండో వార్డ్ లోని చిలుక వెంకటి ఇంటి వద్ద మరియు మూడో వార్డు హనుమాన్ గుడి టెంపుల్ వద్ద బోరు ప్రెస్సింగ్ చేసేది ఉందని ఈవో వినీల్ కుమార్ రెడ్డి కి దృష్టికి తీసుకువెళ్లగా నాలుగైదు రోజులలో మీటింగ్ పెట్టి మీటింగ్లో తీర్మానం చేయించి రెండు మూడు వార్డులోని బోరు ప్రెస్సింగ్ చేపిస్తానని చెప్పాడని వార్డు సభ్యులు తెలిపారు.

# ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

### ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్

**రామగిరి, ( జనంసాక్షి ) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా రామగిరి మండలంలోని ఆదివారంపేట, రాజాపూర్ గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఆదివారంపేట, రాజాపూర్ గ్రామంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను, గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు, సభ్యులు వారి విద్యా అర్హతల గురించి, చదువు మానేసిన, ఉన్నత చదువులు, వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి, వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో, ఎన్ని గంటలు పని చేశారో, ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలను కూడా నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఇల్లందుల సంజీవ్, పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య, పంచాయతీ సెక్రటరీలు మెండే వేణుగోపాల్, దాసరపు కిరణ్, ఆశా వర్కర్లు, కాదాసి స్వప్న, సంధ్యా, అంగన్వాడి టీచర్లు ఇల్లందుల లలిత, కారోబార్ పరశురాములు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కృషి శతకం పుస్తకావిష్కరణకు కరపత్రం ఆవిష్కరించిన ఉపాధ్యాయబృందం




**గంభీరావుపేట ఏప్రిల్ 17(జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ఉన్నత పరిషత్ పాఠశాల లింగన్నపేట పాఠశాలలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్సకుర్మ రిషిక రాసిన కృషిశతకం ఈనెల 20 తారీకున పాఠశాల ప్రాంగణంలో పుస్తకావిష్కరణ మహోత్సవం ఉన్నట్టు దానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించారు. ఇట్టి పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు కసిరెడ్డి వెంకటరెడ్డి , జిల్లా విద్యాశాఖాధికారి బొల్గం జగన్ మోహన్ రెడ్డి సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఛైర్మన్ సుభద్ర, అబ్రవేణి నర్సింలు మరియు బాల సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, వాసరవేణి పర్షరాములు హాజరవుతారని ప్రధానోపాధ్యాయులు సంటి గంగారాం తెలిపారు. రిషిక కుసాహిత్యంలో చిన్న వయసులో శతకం రాయడం గర్వకారణం9వ తరగతి చదువుతున్న రిషిక ఇంత చిన్నవయసులో సాహిత్యంలో ఉన్నత స్థాయిగా శతకం రాయడం గర్వంగా ఉందని, లింగన్న పేటలో వాసి (ప్రస్తుతం అమెరికా)అయిన బాలన్నగారి ఆనందరావు పుస్తక ముద్రణకు ఆర్థిక సాయం అందించినందుకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రిషికను శతకం రాసే స్థాయికి తీసుకు వచ్చిన తెలుగు ఉపాధ్యాయులు, కవి కాల్వ రాజయ్య కృషి గొప్పదని కొనియాడారు. అదే విధంగా మరో తెలుగు ఉపాధ్యాయులు యం. నరేందర్ మరియు ఉపాధ్యాయ బృందం అందరి ప్రేరణ గొప్పదని తెలుపుతూ ఇట్టి కార్యక్రమంలో అందరూ పాలు పంచుకొని విజయవంతం చేయాలని తెలిపారు.

# సదుపాయాలు మెరుగుపరచాలంటూ అంజన్న భక్తుల ఆవేదన



**మల్యాల ఏప్రిల్ 17 (జనం సాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం జరిపిన హుండీ లెక్కింపులో పారిశుధ్య లోపం భక్తులకు ప్రాథమిక సదుపాయాలు మెరుగుపరచాలంటు లేదంటే హుండీలో డబ్బులు వేయకుండా తమ గ్రామంలోని హనుమాన్ ఆలయాలు అభివృద్ధి చేసుకుంటామంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ హనుమాన్ భక్తులు రాసిన లేఖ ఉండడంతో ఆలయ అధికారులు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేయగా ఏప్రిల్ 2వ తేదీ చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన ఉత్సవాలకు వచ్చిన హనుమాన్ భక్తుడు రాసిన లేఖలో భక్తులకు ప్రాథమిక సదుపాయాలు సరిగా లేవని ఆలయ పరిసరాలలో పారిశుద్ధ్య లోపం ఉందని, కోనేరు నీరు అపరిశుభ్రంగా ఉందని, సరియైన నీటి వసతి లేదని, మరుగుదొడ్లు మౌలిక వసతులు సరిగా లేవని తక్షణమే ఆలయ అధికారులు స్పందించి భక్తులకు మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సదుపాయాలు మెరుగుపరిచి ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సామాన్య భక్తులు కోరుకుంటున్నారు.



ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీందర్

కమ్మర్‌పల్లిఏప్రిల్ 17(జనంసాక్షి )

మండల కేంద్రంలోని చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రైతు వేదికలో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీందర్ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎటువంటి వ్యాధులు కూడా వ్యాపించకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు.గర్భిణీ స్త్రీల నమోదు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపు,వేసవికాలంలో వడదెబ్బ నివారణ చర్యలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో గృహ సందర్శనల సమయంలో సిబ్బంది తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి ప్రజలకు వడదెబ్బ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్పందన,ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, పర్యవేక్షకులు స్వరూప,వైద్య సిబ్బంది,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిహాది మూకలను నమ్మొద్దు..

**- ఆర్మూర్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన**



**ఆర్మూర్,ఏప్రిల్ 17 ( జనంసాక్షి):**

హిందూ సమాజంలోని వారందరిని ఒకే కుటుంబంగా భావించాలని, హిందువులందరూ జాగృతం కావాలని ఆర్మూర్ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆర్మూరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దేశంలో పెరుగుతున్న వికృత లవ్ జిహాది చేష్టలను, అసంఘటిత కార్యకలాపాలను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్,బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లవ్ జిహాదీ మూకలను నమ్మద్దన్నారు. హిందూ ధర్మం ప్రకారం తల్లిదండ్రులు చూపిన బాటలో నడవాలని, ప్రేమ పేరుతో హిందూ అమ్మాయిలను వంచనకు గురవుతున్నారని, తస్మాత్ జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. లవ్ జిహాదీ పేరుతో 180 మంది అమ్మాయిలను ట్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే కాకుండా మతమార్పిడికి గురి చేశారని వాపోయారు. భూములు, ఆహార పదార్థాలపై అపవిత్ర పనులను చేస్తున్న వారిపై జాగ్రత్త వహించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేషా సంపర్క్ ప్రముఖ్ అల్లాపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి రవి,జిల్లా ప్రచార ప్రముఖ్ బొచకర్ నిఖిల్, నగర ఉపాధ్యక్షులు గంజాల ప్రేమ్, సహ కార్యదర్శి బోబిడే కరణ్ , సురక్ష ప్రముఖ్ ప్రవీణ్,సహ సంయోజక్ అభిలాష్,సేవా ప్రముఖ్ శ్రీకాంత్,సప్తాహిక్ మిలన్ అరవింద్,సత్సంగ్ ప్రముఖ్ సచిన్, బలోపాసన ప్రముఖ్ సాయి,సంస్కృత ప్రముఖ్ యోగేష్, రిషి, లింబాద్రి, రఘు,బిట్టు, అభినయ్, విజయ్,ధనుంజయ, కార్యకర్తలు పాల్గొన్నారు

## పిట్లం హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**పిట్లం ఏప్రిల్ 17(జనం సాక్షి)**

పిట్లం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్లో ఈ నెల 22 వ తేదీన నిర్వహించే హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రికను సమ్మేళన సమితి అధ్యక్షులు నారాయణ మరియు ప్రధాన కార్యదర్శి గంగా ప్రవీణ్ స్థానిక శిశు మందిర్ స్కూల్లో హిందూ సమ్మేళన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఏప్రిల్ 22 వ తేదీన సాయంత్రం 5 గంటలకు రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో నిర్వహించే హిందూ సమ్మేళన సమితి కార్యక్రమాన్ని తిమ్మానగర్, హస్నాపూర్, మార్దండా, కంబాపూర్, పిట్లం, పోతిరెడ్డిపల్లి, మరియు తండాలు సమస్త హిందూ బంధువులు అందరు కులాలు పార్టీలకు అతీతంగా కుటుంబ సమేతంగా వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సమితి సభ్యులు, హిందూ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్ అవార్డు ఇవ్వాలే..!

- ఆనాడు తిరస్కరించిన కరెంటోళ్లను కీర్తించేలా చేసిన మాజీ సీఎం కేసీఆర్
- న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ( జనంసాక్షి ) :

ప్రజలను మోసం ఎలా చేయాలో మోసం చేసి ఎలా దర్జాగా ఉండాలో చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్, పద్మశ్రీ అవార్డులు ఇవ్వాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత పది రోజులుగా మంథని డివిజన్ కార్యాలయం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సూపరెంటెంట్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్, పీస్‌రేటు కార్మికుల నిరవధిక సమ్మె దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలుపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మార్పు పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిందని,గత 28 నెలలుగా ఇబ్బందులు పెడుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఏ విధంగా ఉంటుందో అధికారం వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో 18 ఏండ్ల ఓటు హక్కు కల్గిన వ్యక్తి యాభై ఏండ్ల వరకు గుర్తుండే విధంగా పరిపాలన చేయడం అద్భుతంగా భావించవచ్చన్నారు. దేశంలో పద్మశ్రీలు, పద్మభూషన్‌లు అవార్డులు సేవలు చేసే వారికి మాత్రమే ఇస్తారని, కానీ ఇందిరమ్మ మార్పు పేరుతో ఇందిరమ్మ ప్రజా పాలన పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ అవార్డులు ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాల్లోని కార్యకర్త నుంచి రాహుల్ గాంధీ వరకు ఈ విధంగానే వ్యవహరిస్తున్నారని, మహిళలకు 2500 లు ఇయ్యకుండా ఇచ్చినట్లు, బీసీ రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఇచ్చినమని చెప్తున్నారని అన్నారు. ఆనాడు పాదయాత్ర చేసిన సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క విద్యుత్ కార్మికుల హామీ ఇచ్చి ఈనాడు విస్మరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేయడంలో అద్భుతాలు సృష్టిస్తోందని విమర్శించారు. ఈనాటికి రిటైర్డ్ మెంట్ వరకు వచ్చినా ఇంకా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నయో వాటిని పూర్తి చేయడం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె సరైందన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడక ముందు కేసీఆర్ రాకముందు కరెంటు వాళ్లను ఎలా తిరస్కరించుకునే పరిస్థితి ఉందో చూశామని, కానీ పదేళ్ల కాలంలో అదే కరెంటోళ్లను కీర్తించే స్థాయికి కేసీఆర్ తీసుకువచ్చారని అన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాకపోవచ్చు కానీ గౌరవించే వరకు తీసుకువచ్చారని అన్నారు. ఇందిరమ్మ పాలన అంటే చీకటి మోస దగా పాలన అనే రీతికి తీసుకువచ్చిండ్లని, కార్మికుల నిరవధిక సమ్మె ఇందుకు ఉదాహరణ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదేండ్ల తర్వాత ప్రజలు కొంత వ్యతిరేకించవచ్చు కానీ ఈనాడు రెండున్నర ఏండ్లకే కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడిలకు భయపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా కల్పించారు.



## తెలంగాణ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా అల్లె లావణ్య నియామకం

**బోధన్ ఏప్రిల్ 17 ( జనంసాక్షి ) :**



నిజామాబాద్ జిల్లా సాలూరా మండల కేంద్రానికి చెందిన అల్లె లావణ్య రమేష్ ను తెలంగాణ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమాజ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, వివిధ రంగాలలో సేవా కార్యక్రమాల పట్ల నిబద్ధతతో కృషి చేసినందుకు ప్రభుత్వం ఆమెను తెలంగాణ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమించారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించడంతో పాటు బోధన్ ఉమ్మడి మండలాలకు జడ్పీటీసీగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. వృత్తిరీత్యా లాయర్ గా కొనసాగుతున్న అల్లె లావణ్య రమేష్ కు బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచనల మేరకు ఆమెను తెలంగాణ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా అల్లె లావణ్య రమేష్ మాట్లాడుతూ, బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి అందించిన ఈ పదవికి న్యాయం చేయడంతో పాటు మరింత తోడ్పాటు అందిస్తానని ఆమె స్పష్టంగా చేశారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత ? నిందితుల బైండోవర్

**కరీంనగర్ క్రైమ్ ఏప్రిల్ 17 ( జనం సాక్షి)**



కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అక్రమ ఇసుక రవాణాపై చర్యలు చేపట్టారు. చేగుర్తి గ్రామానికి చెందిన చామనపల్లి సంపత్ కుమార్, చామనపల్లి విజయ్ తమ ట్రాక్టర్లలో మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను తవ్వి కరీంనగర్ వైపు తరలిస్తుండగా, దుర్శేడ్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వారిని పట్టుకున్నారు.అదేవిధంగా, నగనూరు గ్రామానికి చెందిన అచ్చ కనకయ్య నగనూరు గ్రామ శివారులోని మూల వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనల్లో ఉపయోగించిన మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు పంపించారు. అనంతరం నిందితులను కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి, లక్ష రూపాయల పూచీకత్తుపై మరోసారి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని బైండోవర్ చేశారు.ఇలాంటి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించిన కథలాపూర్ మండల టీజీజేఏసీ

**కథలాపూర్ ఏప్రిల్ 17(జనం సాక్షి )**



కథలాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జె.ఏ.సి (టీజీజేఏసీ ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమం కథలాపూర్ మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా కథలాపూర్ మండల జె.ఏ.సి బృందం స్థానిక తహసీల్దార్ శ్రీ రమేష్ ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమ ముఖ్యడిమాండ్లుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న (పి.ఆర్.సి )అమలు, డి.ఏ (డి ఏ ) బకాయిల విడుదల, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లులు మరియు ఇతర సర్వీస్ నిబంధనల పరిష్కారం కోసం ఈ నిరసన చేపట్టారు.ఐక్యత: మండలంలోని వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి, నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.తహసీల్దార్ స్పందన: వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ రమేష్, ఉద్యోగుల విన్నపాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జె.ఏ.సి నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల జె.ఏ.సి బాధ్యులు, వివిధ సంఘాల నాయకులు మరియు ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో నిరసనలో ప్రభుత్వ కళాశాల సిబ్బంది




**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 17 ( జనం సాక్షి )** టజేఈజేఏసీ పిలుపు మేరకు ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ ఠ సైన్స్ కళాశాల సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఐక్యంగా పాల్గొని తమ డిమాండ్ల పరిష్కారం కోరారు. సి సి ఈ జేఏసి చైర్మన్ డా. సురేందర్ రెడ్డి పిలుపు మేరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది ఐక్యతతో నిరసన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టజేఈజేఏసీ అదనపు కార్యదర్శి ఆ. నాగరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి. రాజయ్య, ఏఓ ఉమా రాణి, డా. టి. శ్రీనివాస్, ఎం. రాజేష్, డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి, డా. ఎం. సత్యప్రకాశ్, డా. టి. కరుణాకర్, ఆర్. సంజీవ్, డా. ఎం. మల్లారెడ్డి, డా. ఏ. శంకరయ్య, డా. ఎన్. శ్రీనివాస్, డా. ఆర్. శ్రీనివాస్, సుధాకర్ తదితరులతో పాటు బోధనేతర సిబ్బంది సరేందర్, తార, కొమురయ్య, స్వామి, సాయికిరణ్ పాల్గొన్నారు.

# మైతాపూర్‌లో రోడ్డు వివాదం

### తహసీల్దార్‌కు వార్డు సభ్యుల వినతిపత్రం

### నక్ష ప్రకారం సర్వే చేసినా అడ్డంకులు కొనసాగుతున్నాయన్న ఆవేదన



**రాయికల్ జనం సాక్షి :** మండలంలోని మైతాపూర్ గ్రామంలో దుర్గాదేవి ఆలయానికి వెళ్లే రహదారి సమస్యను వెంటనే పరిష్కరించి,ప్రభుత్వ నక్ష ప్రకారం హద్దులు ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం సమర్పించారు.గ్రామంలోని గనె గుట్టపై ఉన్న కనకదుర్గమ్మ సన్నిధికి రాజ్యసభ సభ్యుడు దినకోండ దామోదర్ రావు నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసి సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు.అయితే పక్కనే ఉన్న పట్టా భూమి యజమాని రహదారికి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే అధికారులు గ్రామానికి వచ్చి నక్ష ప్రకారం భూమి కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేసినా,వాటిని తొలగించడంతో సమస్య కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామానికి వచ్చి హద్దులు పునఃస్థాపించి రహదారి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బూస గంగ మల్లయ్య,అనుమల్ల రమ,భూపెల్లి పరమేశ్వర్,తొగిటి నవీన్ కుమార్, బత్తిని శ్రీనివాస్ గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల మధు కుమార్, నాయకులు అనుమల్ల సత్యనారాయణ,కొల్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# జలుసాలకు అలవాటు పడి వ్యక్తి అరెస్ట్




**వీణవంక ఏప్రిల్ 17 (జనం సాక్షి)** వీణవంక మండలంలోని పలు గ్రామాల గుడిలలో వరస దొంగతనాల పాల్పడుతున్న వ్యక్తి నీ అరెస్టు చేసినట్లు జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ,వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లాకు చెందిన కుంటాల భీమయ్య,అతని సహచరుడు మడక నరసయ్య ఇద్దరు కలిసి వీణవంక మండలంలోని ఎల్బాక,గంగారం గ్రామాల మధ్యలో పెద్దమ్మ ఆలయంలో,కోర్కల్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ,పెద్దమ్మ తల్లి ఆలయాల్లో,కొండపాక గ్రామంలోని పెద్దమ్మ తల్లి,రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాల్లో ఇటీవల రాత్రి సమయంలో గుడిలలో తాళాలు పగలగొట్టి దొంగ తనాలకు పాల్పడి విలువైన సొమ్ములు దొంగలించారని గురువారం రోజున మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న భీమయ్యను పోలీసులు పట్టుకొని విచారించగా గుడిలలో దొంగతనాలు చేయగా వచ్చిన సొమ్ము ను తాగుడుకు బానిస కాగా జల్సాలకు వాడుకున్నామని మరికొంత సొమ్ము నరసయ్య వద్ద ఉందని,భీమయ్య వద్ద ఉన్న వెయ్యి రూపాయలు స్వాధీనం చేసుకొన్నామని నరసయ్య పరారీలో ఉన్నాడని ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ,ఎస్ఐ ఆవుల తిరుపతి మండలంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాసదంగా గ్రామాలలో సంచరించినట్లయితే వారి సమాచారం నేరుగా పోలీసులకు గాని, ఫోన్ ద్వారా గాని తెలుపాలని వారి సమాచారం గోప్యంగా ఉంచుదామని వారన్నారు.

### అంగన్వాడీల కేంద్రాలను ఆకస్మిక చేసిన సర్పంచ్



**మల్లాపూర్ఏప్రిల్17(జనంసాక్షి)** మండలంలోని సాతారం గ్రామంలో మూడు అంగన్వాడిని కేంద్రాలను సర్పంచ్ పోతమేని నారాయణ గౌడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేంద్రాలలో నిర్వహించే కార్యక్రమాల గురించి అంగన్వాడి టీచర్లను అడిగి తెలుసుకున్నారు వారికి కావలసిన సదుపాయాల గురించి అడుగగా రెండవ అంగనవాడి కేంద్రంలోని ఫ్యాన్ లేనందున నూతనంగా ఫ్యాన్ సదుపాయాన్ని ఆయన ఎలక్ట్రిషన్ ఫిక్సింగ్ చేయమని చెప్పారు. మరియు పిల్లల పౌష్టికాహారం గర్భిణీలకు బాలింతలకు ఇచ్చే సరుకులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వినోద్ కుమార్ మరియు కొడుపెల్లి సురేష్ ఎలక్ట్రిషన్ తోకల నరేష్ అంగన్వాడి కార్యకర్తలు ఉన్నారు.

## రాజన్న సిరిసిల్ల సర్కిల్, గంభీరావుపేట సెక్షన్‌లో 3.0 కి.మీ. 33కేవీ ఇంటర్‌లింక్ లైన్ విజయవంతంగా చార్జ్



**గంభీరావుపేట ఏప్రిల్ 17(జనం సాక్షి)**రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండల పరిధిలోని కొత్తపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించే మహత్తర లక్ష్యంతో 3.0 కిలోమీటర్ల పొడవైన 33కేవీ ఇంటర్‌లింక్ లైన్‌ను విజయవంతంగా శుక్రవారం చార్జ్ చేశామని ఎన్పీడీసియల్ చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్-1), బి. అశోక్ తెలిపారు.విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన ఈ ఇంటర్లీకింగ్ లైన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్), సిరిసిల్ల టి. వేణు మాధవ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, వారి సమక్షంలో అత్యంత విజయవంతంగా నిర్వహించబడిందనీ అన్నారు.ఈ ఇంటర్‌లింక్ లైన్ ప్రారంభంతో కొత్తపల్లి, శ్రీగాధ, కొల్లమడ్డి, రాజుపేట గ్రామాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని అశోక్ స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడినప్పుడు లేదా భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రధాన విద్యుత్ లైన్లలో అంతరాయాలు సంభవించినప్పుడు, ఈ ఇంటర్‌లింక్ లైన్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గంలో నిరవధికంగా విద్యుత్ సరఫరా కొనసాగించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. దీని వలన గ్రామీణ ప్రాంత వినియోగదారులకు కరెంటు అంతరాయాలు గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాలో నిరంతరత సాధించడం వలన ఈ గ్రామాల రైతులకు వ్యవసాయ విద్యుత్ సకాలంలో అందుతుందని, గృహ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సేవలు లభిస్తాయని, స్థానిక చిన్న పరిశ్రమలకు వ్యాపారాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందని అశోక్ వివరించారు. ఈ ఇంటర్‌లింక్ లైన్ ఏర్పాటు వలన విద్యుత్ వ్యవస్థలో రెండు మార్గాల సరఫరా అందుబాటులోకి వచ్చిందని, ఇది ఆధునిక విద్యుత్ పంపిణీ వ్యవస్థకు ఒక మైలురాయి అని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో, అత్యంత నేర్పుతో విజయవంతంగా పూర్తిచేసిన గంభీరావుపేట సెక్షన్ సిబ్బందిని,సంబంధిత ఇంజినీర్లను సీఈ బి. అశోక్ , ఎస్ఈ టి. వేణు మాధవ్ అభినందించారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ విభాగపు అత్యున్నత లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం శ్రమిస్తామని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సర్కిల్ పరిధిలోని ఇతర సబ్‌స్టేషన్లకు కూడా ఇలాంటి ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్) టి. వేణు మాధవ్ , డివిజినల్ ఇంజినీర్ ఎన్. అంజయ్య , అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ శ్రీనివాస్ , అసిస్టెంట్ ఇంజినీర్లు శ్రీ ఆనంద్, పద్మ మరియు గంభీరావుపేట సెక్షన్ సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం గర్జించిన కరీంనగర్ జేఏసీ

### కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జె ఎ సి నాయకులు

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :**తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు సరెండర్ లీవ్ మెడికల్ బిల్లులు ఇన్సూరెన్స్ బిల్లులు జిపిఎఫ్ వంటి రాజ్యాంగబద్ధ హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2023 జులై 1 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ అమలు కాకపోవడం, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం ఉద్యోగులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నదని తెలిపారు. మా రక్తపు చుక్కలను చెమట చుక్కలుగా మార్చి, ప్రతి నెల పైసా పైసా ప్రోగుదీసి ప్రభుత్వం వద్ద దాచుకుంటే ఆ డబ్బులు మా పిల్లల పెళ్లిళ్ల కోసం, సొంత ఇల్లు నిర్మాణం కోసం, చేసిన అప్పులు తీర్చడానికి, ఆరోగ్య అత్యవసరాల కోసం ఉపయోగపడాలనేది మా ఆశ కానీ మేం దాచుకున్న డబ్బుల కోసం మేమే రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరం అన్నారు. మాకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు అని తన వేదనను వ్యక్తం చేశారు. ఓపిఎస్ పునరుద్ధరణ, హెల్త్ కార్డు అమలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి అంశాల్లో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కి వినతి పత్రం సమర్పించగా, దాన్ని ప్రభుత్వానికి పంపిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, కటకం రమేష్, పేండ్యల కేశవ రెడ్డి, పిఆర్టియు కరుణాకర్ రెడ్డి, తిరుపతిరావు, జావిద్, రామ్మోహన్, ఆడేపు శ్రీనివాస్, కోట శ్యాం కుమార్,సర్దార్ హర్మిందర్ సింగ్, శారద, సునీత, సబిత సరిత, కోట రామస్వామి, శంకర్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

## భూ సమస్యలు పరిష్కారం చేయాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ



జనం సాక్షి కోరుట్ల :
భూ సమస్యలు పరిష్కరించాలని, వెంటనే మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరుట్ల స్థానిక బీట్ మార్కెట్లో తెలంగాణ రైతు సంఘం జగిత్యాల జిల్లా ముఖ్య బాధ్యుల సమావేశం లకావత్ మహిపాల్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1.85 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 73 వేల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. అదేవిధంగా అనేక వేల ఎకరాలలో వరి పంటను సాగు చేశా రన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న పంట చేతి కొచ్చిందన్నారు. ఇప్పటికి కొన్ని గ్రామాలకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన రైతులు ప్రైవేట్ వ్యాపారులకం గత్యంతరం లేక అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 రూపాయల ప్రకటించిదని, కానీ మార్కెట్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రూ. 1600 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనివలన రైతు క్వింటాకు ఎనిమిది వందల రూపాయలు నష్టపోతున్నారన్నారు. మొక్కజొన్న కొనుగోలుపై ప్రభుత్వం పరిమితి విధించటం సరైంది కాదన్నారు. రైతు వద్ద ఉన్న మొక్కజొన్న మొత్తం ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కొక్క రైతు నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని విధించిన పరిమితిని వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కొక్క ఎకరం నుంచి 40 క్వింటాలు దిగుబడి వస్తుందని, మిగిలిన పంట రైతులు ఎవరికి అమ్ముకోవాలని ఆయన ప్రశ్నించారు. భూ సమస్యల పరిష్కారం చేయకుండా రైతు సమస్యలు పరిష్కారం కావన్నారు. తెలంగాణ రైతు సంఘం భూ భారతి చట్టం తీసుకొచ్చి ప్రజలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని కానీ నేటి వరకు దాని అమలు ఊసే లేదన్నారు. సాదా బైనామా లో వచ్చిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనియెడల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో బాధిత రైతులతో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు లకావత్ మహిపాల్ బెజ్జంకి కర్ణాకర్ గుగులవత్ తిరుపతి నాయక్ లింగంపల్లి కొండయ్య, కె జనార్ధన్ కారేపల్లి లింగారెడ్డి ఏ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ రైతు సంఘం**
**నూతన జిల్లా కమిటీ ఎన్నిక:**
జిల్లా అధ్యక్షునిగా సూధవేణి భూమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా లకావత్ మహిపాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులుగా బెజ్జంకి కరుణాకర్ రావు, గుగులాత్ తిరుపతి నాయక్, లింగంపల్లి కొండయ్య, జిల్లా సహాయ కార్యదర్శులుగా కే జనార్ధన్, కారేపల్లి లింగారెడ్డి, ఏ గంగారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ముంబై సిద్ధి వినాయక దేవాలయ సందర్శన

**ఆర్మూర్, ఏప్రిల్ 17 ( జనంసాక్షి);**



శ్రీ సిద్ధి వినాయక దేవాలయం, ముంబైలో ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సీఏ ఈ. రాజశేఖర్ వారి కుటుంబ పరివారం స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ముంబై పద్మశాలి సేవా సంఘం ప్రాంతీయ నాయకుడు,శ్రీ సిద్ధి వినాయక ట్రస్ట్ మాజీ ట్రస్టీ ఏకనాథ్ సంగం వారితో కలిసి పాల్గొన్నారు.దేవాలయ కమిటీ వారు ఆత్మీయంగా ఆహ్వానించి,శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏకనాథ్ సంగం మాట్లాడుతూ తాను ఎప్పుడూ తెలంగాణ ప్రజలతో పాటు నిజామాబాద్ జిల్లా ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు.ముఖ్యంగా ఉపాధి కోసం ముంబైకి వచ్చిన తెలంగాణ ప్రజల కోసం సేవ చేయడానికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సిఏ రాజశేఖర్ మాట్లాడుతూ ఏకనాథ్ సంగం తమను ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించి గౌరవించారని తెలిపారు.ముంబై వంటి మహానగరంలో తెలంగాణ తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.తెలంగాణ ప్రజల కోసం ఆయన చేస్తున్న కృషి గొప్పదని, ఆయన ఒక ఆదర్శ వ్యక్తిగా నిలిచారని పేర్కొన్నారు.

# మహిళ రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా సంతకాల సేకరణ

**ఆర్మూర్, ఏప్రిల్ 17 ( జనంసాక్షి):**



భారతీయ జనతా యువమోర్చా ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు ఉదయ్ గౌడ్ ఆధ్వర్యంలో నారీ శక్తి అభియాన్ కార్యక్రమం లో భాగంగా ఇటీవల పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన మహిళ సాధికారత అయినటువంటి 33% మహిళా రిజర్వేషన్ బిల్లుకి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో సంతక సేకరణ చేశారు.బిజెపి పట్టణ అధ్యక్షుడు మందుల బాలు,బీజేవైఎం జిల్లా సీనియర్ నాయకులు కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు ఉన్నారని, చట్టసభలలో కూడా మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించాలని ఉద్దేశంతో మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు పరచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు భరత్, ఉపాధ్యక్షులు మనీష్, చరణ్ గౌడ్, కార్యదర్శి పవన్, శ్రీకాంత్, ధనుంజయ్, బిజెపి ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి,అరుణ్,బిజెపి బిజెవైఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడిన వీర వనిత మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క

వార్డ్ మెంబర్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షురాలు,,
-బోయిని జల ముదిరాజ్

**మల్లాపూర్ ఏప్రిల్17 (జనంసాక్షి)**



మండలంలోని దామ్రాజ్ పల్లి గ్రామంలో వార్డు నెంబర్ బోయిని జల ముదిరాజ్ మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే 1998లో కాంగ్రెస్ పార్టీ మెట్పల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆల్ ఇండియా ఉమెన్ లెజిస్లేటర్ ఫోరంను స్థాపించి దేశ వ్యాప్తంగా మహిళల రాజకీయ ప్రాతినిథ్యం కోసం బలమైన ఉద్యమానికి శ్రీకారం చుట్టారు ఈరోజు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లు పాస్ అయితుంది అంటే దానికి కారణం అప్పటి పోరాటమే ఆమె పోరాటం కోరుట్ల నియోజకవర్గంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు చైతన్యవంతులై ఆమె స్ఫూర్తిని తీసుకొని రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని తెలుపుతూ అలాగ నేను ఈరోజు వార్డ్ మెంబర్ గా మరియు ఫోరంలో కీలకంగా ఉన్నాను అంటే దానికి కారణం స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క స్ఫూర్తితోనే ఉన్నామని వారి సిద్ధాంతాలను వారి ఆలోచన విధానం ఇప్పటి మహిళాలు యువత ధైర్యంగా ముందుకు వచ్చి పోరాటం చేయాలని తెలిపారు.

## ఎన్ హెచ్ 161 వారి సహకారంతో పాత్రికేయులకు హెల్మెట్లు పంపిణీ

**పిట్లం ఏప్రిల్ 17 (జనంసాక్షి)**
పిట్లం మండల కేంద్రంలోని స్థానిక రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో నిర్వహించినటు వంటి అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో ఎన్ హెచ్ 161 సిబ్బంది రోడ్డు భద్రత భాగంగా మీడియా మిత్రులకు డీఎస్పీ విట్టల్ రెడ్డి చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ 161 సిబ్బంది మాట్లాడుతూ... ప్రజలలో అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నటువంటి మీడియా మిత్రులకు హెల్మెట్లు తప్పనిసరి అని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ తిరుపతయ్య ఎస్సై ఆంజనేయులు ఎన్ హెచ్ 161 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జూన్ 2 లోగ పిఆర్సిని అమలు చేయాలి

**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 17 జనంసాక్షి:**
జూన్ 2వ తేదీ లోగ పి ఆర్ సి ని అమలు చేయాలనీ శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా ఐడిఓసి కార్యాలయం ముందు టి జి ఈ జే ఏ సి ఉద్యోగ ఉపాధ్యాయ గజిటెడ్ కార్మికుల పెన్షనర్ ల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.నిరసన కార్యక్రమానికి టీజీఈ జేఏసీ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ జనరల్ పులగం దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... . తెలంగాణ ఉద్యమ అనంతరం 10 సంవత్సరాల తర్వాత ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించుటకు, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ , సెక్రటరీ జనరల్ ఏలూరీ శ్రీనివాస్ రావు అధ్యక్షతన, 206 పైగా భాగస్వామ్య సంఘాలతో టీజీఈ జేఏసీ ని స్థాపించి, పలుమార్లు 69 పైగా డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేసినప్పటికీని, ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగుల సమస్యలను పెడచెవిన పెట్టడం వల్ల, ఉద్యమ కార్యచరణను ప్రకటించిన నేపథ్యంలో... ఇదివరకే ప్రభుత్వానికి నివేదించిన 69 డిమాండ్ లో అతి ముఖ్యమైన నాలుగు డిమాండ్లలో మొదటిది, పి ఆర్ సి కమిటీ వేసి 30 నెలల గడుస్తున్నప్పటికిని నేటికి నివేదిక తెప్పించుకోకపోవడం విడ్డూరమని, అతి త్వరగా 51% ఫిట్మెంట్ తో, 2 వ పిఆర్సిని, అమలు చేయాలనిరెండవది ఉద్యోగులకు 13 వేల కోట్లకు పైగా బకాయి పడ్డ పెండింగ్ బిల్లుల అన్నింటిని ఏక మొత్తంగా విడుదల చేయాలని, మూడవది అతి ముఖ్యమైనది ఉద్యోగులకు కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ విధానాన్ని అమలు చేస్తూ, ఆరోగ్య కార్డులను అమలు




చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టి మరచినట్టు కాదని, సెప్టెంబర్ 2004 తర్వాత నియమించబడిన ఉద్యోగులందరికీ సీపీఎస్ స్కీం నుండి రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, వీటితోపాటు మిగతా 64 డిమాండ్లను కూడా పరిష్కరించాలని, నిరసన ప్రదర్శనను చేపట్టామని... ఉద్యమ కార్యచరణలో భాగంగా, మే 5 న సామూహిక నిరాహార దీక్షలు నిర్వహిస్తామని తెలుపుతూ, అయినను రాష్ట్ర ప్రభుత్వం ,ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే, రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.అనంతరం టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ... ఉద్యమ కార్యచరణలో భాగంగా, నిరసన కార్యక్రమానికి విచ్చేసిన టీజీఈ జేఏసీ రాష్ట్ర బాధ్యులు పులగం దామోదర్ రెడ్డి కి టీజీఈజేఏసీ జిల్లా భాగస్వామ్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు, కార్యవర్గ సభ్యులకు, అన్ని శాఖల ఉద్యోగులకు మహిళా ఉద్యోగ సోదరులందరికీ ఉద్యమాభివంధనాలు తెలియజేస్తూ... టీజీఈజేఏసీ రాష్ట్ర బాధ్యులు దామోదర్ రెడ్డి గారు తెలిపినట్టు పైన తెలిపిన నాలుగు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యమ కార్యచరణను నిర్వహించుటకు సిద్ధంగా ఉన్నామని, దీనికి గాను ఉద్యోగులందరూ సమాయతనీ కావాలని తెలిపారు సూచించారు.నిరసన కార్యక్రమానికి వీరితోపాటు టీజీఈజేఏసీ జిల్లా కోకన్వీనర్ మోహన్ రెడ్డి, కో చైర్మన్లు రమేష్, రమన్ రెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సురేష్, పండరినాథ్, వైస్ చైర్మన్లు విజయ్ సింగ్, శేఖర్ ,అమృత్ కుమార్, ప్రశాంత్ ,మోహన్, ఫైనాన్స్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్,టీజీఈ జేఏసీ జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, అంగన్వాడీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగ సోదరీమణులు అధిక సంఖ్యలో నిరసన కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఉపాధ్యాయ సంఘాల నిరసన

**చొప్పదండి, ఏప్రిల్ 17( జనంసాక్షి):**
2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు,కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ సిబ్బంది నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా టీజీఇ జెఎసి జిల్లా కో చైర్మన్ ముల్కల విజయ్ కుమార్,డిటిఎఫ్ రాష్ట్ర బాధ్యులు కానీగంటి రాజమౌళి, పిఆర్టియు రాష్ట్ర బాధ్యులు ఆనందం లు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లో డిఏలు చెల్లిస్తామని,ఆరు నెలల్లో రెండవ పిఆర్సి ని అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ 30 నెలలు గా అమలుకు నోచుకోలేదని విమర్శించారు.ప్రజా ప్రభుత్వంలో సైతం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ఎదురుచూపులే మిగిలాయన్నారు. పెండింగ్ బిల్లుల కోసం నెలకు 700 కోట్లు విడుదల చేసినప్పటికీ ఎక్కువ మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండడంతో ఏక మొత్తంగా రూ. 1300 కోట్లు విడుదల చేయాలన్నారు. ఆరోగ్య కార్డులపై మంత్రివర్గ ఉప సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోనప్పటికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమలు చేస్తామని పదే పదే చెప్పిన మాటను నిలబెట్టుకోవాన్నారు. కార్యక్రమం లో పిఆర్టియు బాధ్యులు శ్రీనివాస చారి, వెంకటేశ్వరరావు, రామ్ రెడ్డి బాలరెడ్డి,సముద్రాల అంజయ్య,టిపిటిఎఫ్ బాధ్యులు రామస్వామి,శ్రీనివాస్,ఉమాదేవి, టిఆర్టిఎఫ్ గంగాధర్, ఎల్లయ్య,పిఈటి అసోసియేషన్ బాధ్యులు కృష్ణ, చంద్రశేఖర్, ఎస్జిటీ యూనియన్ బాధ్యులు శాంతికిరణ్,రవి,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నుండి అశోక్,శ్రీనివాస్,శ్రీకాంత్,వీరేశం, టి జీవో, టీఎన్జీవో బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు అండగా వైద్యుడు



**చొప్పదండి, ఏప్రిల్17 (జనం సాక్షి):**
మండలంలోని చాకుంట గ్రామంలో అనాథలైన పిల్లలు ఆదిత్య,శ్రీనివాస్ కు విద్య, వైద్య బాధ్యతలు తీసుకొని ఆదుకుని ఔదార్యం చూపారు కరీంనగర్ వన్ హాస్పిటల్ డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి. ఈ మేరకు చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామంలో ముదిరాజ్ కులస్తులు శ్రీనివాస్, ఆదిత్యల తల్లి ఐలవేణి లావణ్య కిడ్నీలు చెడిపోయి గత మూడు సంవత్సరాల క్రితం చనిపోయింది, గత ఆరు రోజుల క్రితం తండ్రి ఐలవేణితిరుపతి అకస్మాత్తుగా చనిపోయాడు.దిక్కుతోచని స్థితిలో పిల్లలు అనాథలై కన్నీటి బాధలో ఉన్నారు, పెద్ద అబ్బాయి ఆదిత్య కు ఒక కన్ను లేదు,ఆపరేషన్ కి కొంత డబ్బు అవసరం ఉన్నదని ఈ సమాచారం సామాజిక మద్యంలో తెలుసుకొని ఏ వన్ డాక్టర్ మర్రి మహేశ్ రెడ్డి. శ్రీనివాస్, ఆదిత్య లను చదివిపించే బాధ్యతను ,వైద్య బాధ్యతలు తీసుకున్నందుకు మహేశ్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

**మంథని, ( జనంసాక్షి ) :**
తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ జేఏసీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా శాఖ వారి సూచన మేరకు శుక్రవారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కమాన్ పూర్ మండల ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ ల న్యాయమైన హక్కుల సాధన కొరకు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ లకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయ మూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు..

**గోదావరిఖని, జనంసాక్షి:**



పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కంచాలను శుక్రవారం గోదావరిఖని బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులను అధ్యక్షులు బల్మూరి అమరేందర్ రావు జిల్లా న్యాయ మూర్తికి పరిచయం చేశారు.ఈ సందర్భం గోదావరిఖని కోర్టులలో నెలకొన్న సమస్యలను ,నూతన కోర్ట్ భవన నిర్మాణం గురించి న్యాయమూర్తికి వివరించారు.ఇక్కడ అధ్యక్షులతో పాటు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి గుజ్జేటి సత్యనారాయణ ,ఉపాధ్యక్షులు కుడిది వెంకటేష్,సంయుక్త కార్యదర్శి కుమార్ ముచ్చకుర్తి,లేడీ రిప్రజెంటేటివ్ ముక్కెర అంజలి,గ్రంథాలయ కార్యదర్శి గజ్జెల ప్రసన్న ,సీనియర్ కార్యవర్గ సభ్యులు జవ్వాజి శ్రీనివాస్,విమెన్ ఎగ్జిక్యూటివ్ చెలికల పద్మజ ,జూనియర్ కార్యవర్గ సభ్యులు చిదురాల రమేష్,మార్కాపురి తిలక్ పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి మంజుల ఉన్నారు.

## విద్యార్థులలో మనోధైర్యం నింపడానికే మోడల్ ఎంసెట్ నిర్వహణ

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్



కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 17 ( జనంసాక్షి )
భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్షలు నేటి నుండి ఈ నెల 21 వరకు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో మొదటి రోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య కన్వీనర్‌గా ఈ కార్యక్రమం ప్రారంభించబడిందని పేర్కొన్నారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి, వారికి మనోధైర్యం నింపడమే ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశ్యమని ఆయన చెప్పారు. ముఖ్యంగా మొదటిసారి పరీక్షలు రాసే విద్యార్థులు భయంతో సరిగా రాయలేక ఇబ్బందులు పడే అవకాశం ఉండటంతో, అలాంటి వారికి ఈ మోడల్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడంతో పాటు, అసలు పరీక్షకు ముందే సరైన ప్రాక్టీస్ లభిస్తుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఎప్పటికప్పుడు విద్యా రంగ సమస్యలపై పోరాటాలు చేస్తూనే, విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, నాయకులు సన్నీ, రాకేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలతో మాట్లాడుదాం..

## విద్యార్థులకు సృజనాత్మకతతో కృత్యాలు నేర్పించాలి..

**ముస్తాబాద్ ఏప్రిల్ 17( జనంసాక్షి)**



పోషణ పక్షంలో భాగంగా సిరిసిల్ల ప్రాజెక్టు పరిధిలోని గూడెం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా అంగన్వాడీల జిల్లా అధికారి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ విద్యార్థులు నిర్వహించిన కృత్యాలను పరిశీలించడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తాయని ఈ సందర్భంగా వివరించడం జరిగింది ఎలాంటి ఒత్తిడి లేకుండా బాలల స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు పాఠాలు నేర్పిస్తారని చెప్పారు ఆటలు పాటలు కృత్యాల ద్వారా విద్య నేర్పడం వలన వికాసం జరుగుతుందని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది మనిషి మేధోవికాసంలో మొదటి 1000 రోజులు అతి కీలకమైనవి కాబట్టి ఈ దశలో పిల్లలకి ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటపాటలతో విద్యను అందించడం ద్వారా వారికి బంగారు భవిష్యత్తును అందించిన వారిని అవుతామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ అనూష, గ్రామ సర్పంచ్ తాటి పెల్లి శంకర్, ఉపసర్పంచ్ గ్రామ నాయకులు శ్రీనివాసరావు , డిహబ్ కోఆర్డినేటర్ రోజా, చైల్డ్ హెల్ప్ అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు, లైన్ సిబ్బంది సాయిరాం పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడు

### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్మెట రాజు

**ముస్తాబాద్ ఏప్రిల్ 17 (జనంసాక్షి)**



ముస్తాబాద్ మండల కేంద్రం తో పాటు వివిధ గ్రామాలలో గ్రామంలో రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు గత 15 రోజుల నుండి తరలిస్తున్నారని,అకాల వర్షాలు కురిసి రైతులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని, అలాగే ఎండ తీవ్రతలు పెరిగినందున రైతులు వడదెబ్బ తగిలి అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నందున వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఎక్కడ వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులు తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కొమ్మెట రాజు అధికారులను మీడియా ముఖంగా కోరారు.

## ప్లాస్టిక్ పూల నిషేధం

**ముస్తాబాద్ ఏప్రిల్ 17 (జనం సాక్షి)**



ప్రభుత్వం సంచ లన నిర్ణయం తీసుకుంది. ప్లాస్టిక్ పూలపై నిషేధం అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ఉత్త ర్వులు జారీ చేసింది. ఇక నుంచి రాష్ట్రంలోని ప్రభు త్వ మార్కెట్లలో ప్లాస్టిక్ పూలను విక్రయించకూడ దని, ఎవరైనా అమ్మితే చర్యలు తీసుకుంటామం టూ హెచ్చరించింది.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రైతు బజార్లు, ప్రభుత్వ మార్కెట్లలో ఈ నిషేధం అమల్లోకి తెచ్చింది. ఒకవేళ ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటా మని, లైసెన్స్ కూడా రద్దు చేస్తామంటూ ప్రకటించింది. సహజ పూలను, వాటి ఉత్ప త్తులను మాత్రమే రైతు బజార్లు, మార్కెట్లలో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇచ్చింది.
ప్రభుత్వ రైతు బజార్లు, మార్కెట్లలో ప్లాస్టిక్ పూలను ఎక్కువగా అమ్ముతున్నట్లు ఫిర్యాదు వచ్చాయి. సహజ పూలను కాకుండా ప్లాస్టిక్ పూల అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే ప్లాస్టిక్ పూల వల్ల సహజ పూల విక్రయాలు జరగడం లేదు. దీని వల్ల తమకు నష్టం జరుగుతోం దని పూల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఈ విషయాన్ని ఇటీవ ల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా రైతు మేళాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు ఆయనను కలిసి తమ బాధను వెల్లబోసుకున్నారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ పూల వల్ల తమకు ఆదాయం రావడం లేదని, నష్టం జరుగుతుందని పూల వ్యాపారులు వాపోయారు. దీంతో తుమ్మల నాగేశ్వరరావు స్పందించి ఈ మేరకు చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లు, మార్కెట్లలో ఈ ఆదేశాలు వర్తించనున్నాయి.

## సిరికొండ మండలంలో

## వరిధాన్యం కొనుగోలు సమస్యలపై వినతి పత్రం

**సిరికొండ ఏప్రిల్ 17 (జనంసాక్షి).**



సిరికొండ మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలపై మండల రైతులు తహసిల్దార్ రవీందర్ రావు, సొసైటీ సీఈవోలకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతు నవీన్ మాట్లాడుతూ గతంలో అమలైన విధంగా ఈసారి కూడా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని, ఐకెపితో పాటు ఐడీసీఎంఎస్, పిఎసిఎస్ కేంద్రాలను కూడా మంజూరు చేయాలని కోరారు. అలాగే స్థానిక రైస్ మిల్లులకు తక్షణమే అలాట్మెంట్ ఇచ్చి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.పంట కోత పూర్తై నెల గడిచినా ధాన్యం విక్రయం జరగక ఇబ్బందులు పడుతున్నామని, రానున్న రోజుల్లో వర్షాల కారణంగా నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని వారు అధికారులను కోరారు.

# మైతాపూర్ దుర్గమ్మ ఆలయ రహదారి హద్దులను వెంటనే నిర్ణయించాలి

**మైతాపూర్ లో ప్రభుత్వ నక్ష ప్రకారం హద్దులు ఏర్పాటు చేసి రోడ్డు కు అనుమతి ఇవ్వాలని తహసిల్దార్ కి వినతిపత్రం అందించిన వార్డు సభ్యులు**

**జనంసాక్షి రాయికల్ :**
రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామంలో ఉన్న ఘణే గుట్ట పైన ఉన్న మరో విజయవాడ కనక దుర్గమ్మ సన్నిధి కి రాజ్యసభ సభ్యులు దినకోండ దామోదర్ రావు గారి నిధుల నుండి దుర్గా దేవి సన్నిధి కి సిమెంట్ రోడ్డు వేయడాని కొరకు మైతాపూర్ గ్రామానికి చెందిన వారి చెల్లెలు వారి బావ గారు యాటం అరుణ దేవి కిషన్ రావు సూచన కొరకు గ్రామ ఆలయానికి రోడ్డు కొరకు పదిహేను లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయాలని కోరారు వారి సూచన మేరకు వెంటనే పదిహేను లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. ఇట్టి నిధుల తో ఆలయానికి సిమెంట్ రహదారి ప్రారంభించిన తర్వాత రోడ్డు పని నడుస్తున్న సమయంలో పక్కనే వున్నటువంటి పట్టా భూమి కలిగి ఉన్న యజమాను రాలు ఇట్టి భూమి సరిహద్దుల వెంట ఉన్న భూములు కలిగి ఉన్న రైతులకు మరియు గ్రామ ఆలయానికి రోడ్డు లేదని పదే పదే అడ్డు వస్తున్న నేపథ్యంలో గ్రామ వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు కలిసి వెంటనే జిల్లా కలెక్టర్ కి గతంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో ఉన్న ఆలయానికి గత శతాబ్ద కాలంలో నుండి ఆలయానికి మరియు అక్కడ ఉన్న భూమి కలిగిన రైతులకు అందరికీ తోవ ఉన్నాదని ఇట్టి రహదారి ని వెంటనే పరిష్కరించాలని ప్రజావాణి కార్యక్రమంలో కోరారు వెంటనే కలెక్టర్ సహాయ సంచాలకులు భూమి కొలతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం గ్రామానికి వెళ్లి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు వెంటనే భూమి కొలతలు సహాయ సంచాలకులు అధికారులు కిషన్ ప్రసాద్ వారి బృందం తో మరియు రాయికల్ తహసిల్దార్ మరియు రెవెన్యూ అధికారులు సర్వే అధికారులు గ్రామ నికి వచ్చి వెంటనే వారి వద్ద ఉన్న భూముల నక్ష ప్రకారం వారి డిజిటల్ కెమెరా లు మరియు డిజిటల్ పరికరాలు తో భూముల సర్వే నిర్వహించి అనంతరం హద్దులు ఏర్పాటు చేశారు. ఇట్టి హద్దులు అక్కడ ఉన్న పట్టా దారు రాలు పీకిపారెసినందున గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మరలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారాని కొరకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరగా వెంటనే అధికారుల ను పిలిచి గ్రామ నికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు వారు వచ్చి గ్రామంలో ఉన్న రైతులను పిలిచి అక్కడ భూములను కొలతలు వేసి నక్ష ప్రకారం గ్రామస్థులు సమక్షంలో భూమి పంచనామా నిర్వహించి వెంటనే భూమి హద్దులు ఏర్పాటు చేశారు అట్టి రోడ్డు హద్దులు ఏర్పాటు చేసిన వాటిని వారు చెడిపెసి అక్కడ ఉన్న హద్దుల ను తీసి వేశారు. వెంటనే భూమి కొలతలు అధికారులు ను సంప్రదించ గా వారు స్పందించి వెంటనే భూమి హద్దులు ఏర్పాటు చేసే నక్ష మరియు భూమి పంచా నమా నిర్వహించిన







కాపీరైట్ కాపీ లను అందించి నటువంటి కా పీ ల ను రాయికల్ తహసిల్దార్ కి అందించి వెంటనే గ్రామానికి వచ్చి సమస్య పరిష్కారం చేయాలని వారిని కోరుతూ శుక్రవారం రోజున గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య అనుమల్ల రమ సత్యనారాయణ భూ పెల్లి పరమేశ్వరు తోగీటి నవీన్ కుమార్ బతిని శ్రీనివాస్ గౌడ్ మరియు గ్రామస్తులు అనుమల్ల సత్యనారాయణ కొల్ల నారాయణ కొల్ల కృష్ణారెడ్డి అనిల్ రవి లింగారెడ్డి ఆనంద ము తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదల నివారణకు ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించిన కథలాపూర్ పోలీస్

**కథలాపూర్, ఏప్రిల్ 16(జనంసాక్షి)**
కథలాపూర్ మండలంలో 'అర్రివ్ –అలైవ్ ' కార్యక్రమంలో భాగంగా హెవీ వాహనాలు, ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సై రవి కిరణ్ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. సింధు, త్రినేత్రి హాస్పిటల్ డా. మైస శ్రీధర్ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, సూచనలు అందించారు. ప్రమాదాల నివారణకు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. శిబిరానికి డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




## గోల్డెన్ అవర్‌లో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు.. పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి..

**గోదావరిఖని, జనంసాక్షి :**
'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలు, ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఎన్టీపీసీ మేనేజ్‌మెంట్‌తో కలిసి శుక్రవారం ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రి, ఎన్టీపీసీ ప్రాంగణాల్లో అంబులెన్స్ డ్రైవర్లు, స్వయంసేవకులకు ఫస్ట్ ఎయిడ్,గోల్డెన్ అవర్ శిక్షణ, ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ టి. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. డీసీపీ మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంట అయిన "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని తెలిపారు. ఈ సమయంలో సరైన వైద్య సహాయం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల సమయంలో బాధితులకు వెంటనే సహాయం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో బాధితులకు త్వరితగతిన సమర్థవంతమైన సహాయం అందించడం,ఫస్ట్ ఎయిడ్ పద్ధతులపై ప్రాక్టికల్ శిక్షణ, గాయపడిన వ్యక్తులను సురక్షితంగా ఆసుపత్రికి తరలించడం, రక్తస్రావం ఆపడం, శ్వాసక్రియలను పరిశీలించడం వంటి కీలక విధానాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంబులెన్స్ డ్రైవర్లు, స్వయంసేవకులు, స్థానికులు కలిపి 100 మందికి పైగా పాల్గొన్నారు.



## విద్యార్థులు పట్టుదలతో మంచి ఫలితాలు సాధించి, తమ భవిష్యత్‌ను గొప్పగా తీర్చిదిద్దుకోవాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్**

**నేటి నుంచి ఏప్రిల్ 25 వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఇంజనీర్ అగ్రికల్చర్ ఫార్మసీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు**

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 17 (జనంసాక్షి)**
భారత విద్యార్థి ఫెడరేషన్ (ాఈఎ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో మోడల్ ఇంజనీర్ అగ్రికల్చర్ ఫార్మసీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ, రాబోయే ఇంజనీర్ అగ్రికల్చర్ ఫార్మసీ సెట్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు సహాయపడటానికి ఈ ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన విద్యార్థులు మరియు కళాశాలల యాజమాన్యాలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఇంజనీర్ అగ్రికల్చర్ ఫార్మసీ సెట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని, దీనివల్ల విద్యార్థులకు మంచి ప్రాక్టీస్ లభిస్తుందని, ముఖ్యంగా మెయిన్ పరీక్షకు ముందు కంప్యూటర్ ఆధారిత పరీక్షలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ, వారి సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో, ఏకాగ్రతతో చదివి తమ కలల భవిష్యత్‌ను సాధించాలని ఆకాంక్షించారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే నేటి నుండి ఏప్రిల్ 25 వరకు వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అసంపల్లి వినయ్ సాగర్, జిల్లా కమిటీ సభ్యులు గన్నారపు రాకేష్, రక్షాక్, అంబాల సందేశ్, అక్షయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## అంజన్న హుండీ ఆదాయం 75 లక్షలు



**మల్యాల ఏప్రిల్ 17 (జనంసాక్షి)**
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామికి భక్తులు భక్తితో చెల్లించిన కానుకలను అధికారుల సమక్షంలో 17 వ తేదీ శుక్రవారం రోజున శ్రీ లలితా సేవా ట్రస్ట్ సభ్యులు హుండీలు 17 రోజులవి విప్పి లెక్కించగా 75,02,126 రూ నగదు,మిశ్రమ బంగారం,మిశ్రమ వెండి బ్యాగులో వేసి సీల్ చేసి తిరిగి ఉండిలో వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో ఎస్.అంజనారెడ్డి, ఏసీ కార్యాలయం ఇన్స్పెక్టర్ రాజమౌళి,ఏఈఓ హరిహార్నాథ్,స్థానాచారి కపిందర్ చారి,ప్రధాన అర్చకులు రామకృష్ణ, పర్యవేక్షకుడు సునీల్,ఏ ఎస్సై శ్రీనివాస్,హోంగార్డ్స్,ఆలయ సిబ్బంది, లలిత సేవట్రస్టు సేవ సమితి వారు పాల్గొన్నారు.హుండీ లెక్కింపులో ఆలయ ఈవో మరియు ఉప కమిషనర్ ఎస్.అంజనారెడ్డి,సహాయక కమిషనర్ సుప్రియ,డివిజన్ పర్యవేక్షకులడు దేవాదాయ శాఖ రాజమొగిలి, ఏఈఓ హరినాథ్ ఆలయ ప్రధాన అర్చకులు కపిందర్,రఘు,ఆలయ పరిశీలకులు అశోక్,ధర్మేందర్ ఏఎస్ఐ శ్రీనివాస్ హోంగార్డ్స్ పోలీస్ మహిళా కానిస్టేబుల్,లలిత సేవా ట్రస్ట్ సభ్యులు బ్యాంకు ఉద్యోగులు ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల దవఖానలో మందుల కొరత



**ముస్తాబాద్ ఏప్రిల్ 17( జనంసాక్షి)**
కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మిక సంక్షేమ నీది స్థానికులకు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆస్పత్రి ఏర్పాటు చేస్తే బీడీ కార్మికులకు ఆరాకోర మందులు అందిస్తూ అనారోగ్య పాలవుతున్న పట్టించుకోవడం లేదు కేంద్ర ప్రభుత్వం. బిపి, షుగర్, దగ్గు, రోగులకు సంబంధించిన మందులు దవఖానలో లేకపోవడం వలన బీడీ కార్మికులు ఇబ్బందులు గురవుతున్నారు, ఆరు నెలల నుండి మందుల కొరత పేషెంట్లు ప్రభుత్వ ఆసుపత్రి నమ్ముకుని రోజు వచ్చుకుంటూ వెళ్లిపోతుంటే పట్టించుకునే అధికారులు కరువయ్యారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ముస్తాబాద్ బీడీ కార్మిక దవాఖానకు మందులు అందించాలని ముస్తాబాద్, గంబీరావుపేట, ఎల్లారెడ్డిపేట, దుబ్బాక, మండలాల ప్రజలు కేంద్ర ప్రభుత్వాం వివిధ రకాల రోలకు మందులు అందించాలని కోరుతున్నారు

## మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చాలి




**గంభీరావుపేట ఏప్రిల్ 17(జనంసాక్షి);**
టీజీఇ జాక్ పిలుపు మేరకు శుక్రవారం రోజు గంభీరావుపేట తాసిల్దార్ ఆఫీస్ ల ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని కన్వీనర్ తాసిల్దార్ మారుతి రెడ్డి చైర్మన్ బోయన్న గారి నారాయణ టిఆర్టిఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లు తెలియచేసారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యానుఫెస్టోలో తెలిపిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు ప్రభుత్వము వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు ఇప్పటికైనా వెన్వెంటనే స్పందించి 51% తోటి పిఆర్సి అమలు చేయాలి సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ ని అమలు చేయాలి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించుటకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో పెద్ద మొత్తంలో టీచర్లు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించిన ఎంపీ

### - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి

**చందుర్తి ( జనంసాక్షి ):**



పార్లమెంట్ వేదికగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్తాన్ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రాష్ట్రం వందలాది మంది విద్యార్థులు, యువకుల ప్రాణత్యాగాల ఫలితమేనని దశాబ్దాల పోరాటం, ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టం ద్వారా ఏర్పడిన రాష్ట్రాన్ని, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ఠ అని ఇది అమరుల త్యాగాలను కించపరచడమేనని మండిపడ్డారు.తెలంగాణ సమాజాన్ని కించపరిచిన తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సొంత రాష్ట్రంపై ఇట్లాంటి వ్యాఖ్యల పట్ల స్థానిక బీజేపీ ఎంపీ ల మౌనం సిగ్గుచేటన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ ఇలాంటి విషపూరిత వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు.

## బేతాళ స్వామి మహా జాతర తేదీలు ఖరారు

**బాన్సువాడ ఏప్రిల్ 17 (జనంసాక్షి)**



బాన్సువాడ: బేతాళ స్వామి మహా జాతర నిర్వహణకు సంబంధించి గ్రామ పెద్దలు సమావేశమై జాతర తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 23వ తేదీన బండ్ల జాతర, 24వ తేదీన కుస్తీ పోటీలు, 25వ తేదీన ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని ఈరోజు వీక్లీ మార్కెట్‌లో చాటింపు ద్వారా గ్రామ ప్రజలకు అధికారికంగా తెలియజేశారు. జాతర ఏర్పాట్లను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని గ్రామ పెద్దలు కోరారు.జాతర సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలలో భక్తులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జాతరను ఘనవిజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## టిజి జేఏసీ ఆర్మూర్ ప్రభుత్వ ఉద్యోగుల నిరసన..

### సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకి వినతి

**ఆర్మూర్,ఏప్రిల్ 17(జనంసాక్షి):**



టీజీ జెఎసి పిలుపుమేరకు ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలియజేస్తూ మధ్యాహ్న భోజన నిరసన కార్యక్రమాన్ని చేపట్టి సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకి శుక్రవారం వినతి పత్రం అందించారు.ఈ నిరసనలో ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లు,అంగన్వాడీ ఉద్యోగులు హాజరైనారు. వారి ప్రధాన డిమాండ్లలో భాగంగా 51% ఫిట్మెంట్ పిఆర్సిని వెంటనే ప్రకటించాలని,అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు.ఈహెచ్ఎస్ ఆరోగ్య కార్డులను మే ఒకటి నుండి వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వము మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. లేనియెడల ఉద్యమ కార్యచరణ ఉదృతం చేసి తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




## పిట్లం లో "అరైవ్ అలైవ్"అవగాహన కార్యక్రమం

**పిట్లం ఏప్రిల్ 17 (జనంసాక్షి)**

పిట్లం మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వం సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమం లో భాగంగా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలు మేరకు బాన్సువాడ డిఎస్పి విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్, రోడ్డు భద్రత కార్యక్రమాన్ని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి విట్టల్ రెడ్డి మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి గోల్డెన్ అవర్ లో సమయానికి సహాయం అందిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు అని అన్నారు. ప్రమాదాలకు గురి అయినప్పుడు స్పృహ కూలిపోతే వెంటనే అక్కడున్నటు వంటి ప్రతి ఒక్కరూ అటువంటి వ్యక్తికి సిపిఆర్ చెయ్యాలి సిపిఆర్ ను ఏ విధంగా చేయాలో ప్రాక్టికల్ గా చూపించారు ప్రమాదాలకు సంబంధించిన అవగాహన వీడియోలను ప్రదర్శించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి అని అన్నారు. హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లూ బెల్స్, రిచ్ మైండ్ పాఠశాల విద్యార్థులు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు ఎన్ హెచ్ 161 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## ఐటీఎఫ్ కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**వేములవాడ (జనంసాక్షి):**



వేములవాడ పట్టణంలోని ఐబీపీ గ్రౌండ్‌లో ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ (ఐ టి ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను 18వ వార్డు కౌన్సిలర్ కొండ శేఖర్, ఐటీఎఫ్ ఫౌండర్ మెంబర్లు దర్శకులు బుర్ర నటరాజ్ గౌడ్, ప్రముఖ నటుడు మారం ప్రవీణ్ కుమార్ (పప్పీ) కలిసి ప్రారంభించారు.?ఈ సందర్భంగా మారం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఐటీఎఫ్ వార్షికోత్సవం సందర్భంగా మహిళలకు ప్రాధాన్యతనిస్తూ బోనాల కార్యక్రమాలు నిర్వహించేవారమని, ఈ ఏడాది పురుష కళాకారులలో ఉత్సాహాన్ని నింపేందుకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుర్ర నటరాజ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాకారులను ఆరు టీములుగా విభజించి ఈ నెల 17, 18, 19 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. క్రీడాకారులకు ఉచితంగా వసతి కల్పించామని, ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు ప్రైజ్ మనీతో పాటు కప్పులు అందజేస్తామని పేర్కొన్నారు.?కౌన్సిలర్ కొండ శేఖర్ మాట్లాడుతూ కళాకారులందరూ ఐక్యతతో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని, తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, పి.ఎల్ రెడ్డి, రంగు అనిల్, ఎరుపుల దేవయ్య, ఆర్గనైజర్లు శీలం విజయ్ యాదవ్, కత్తెరపాక శ్రీనివాస్, గంగ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది కళాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

## డిమాండ్ల సాధనకై నల్ల బ్యాడ్జీలతో నిరసన

**వేములవాడ రూరల్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :**

వేములవాడ రూరల్ మండలం ఎంపీపీఎస్ బాలరాజుపల్లి పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియ ౦జేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలపై టిజిఇజెఏసి (తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ) పిలుపు మేరకు నిరసన చేపట్టామన్నారు. పిఆర్సి అమలు, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఇహెచ్ఎస్, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు, ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు తదితర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలంటూ ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులి రాంగోపాల్ గౌడ్, రాజేశం, మధుకర్, అనిత, లతిక తదితరులు పాల్గొన్నారు.





## కంబాపూర్ గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ బిగించిన సర్పంచ్

**పిట్లం ఏప్రిల్ 17 (జనంసాక్షి)**

పిట్లం మండల పరిధిలోని కంబాపూర్ గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ బిగించినట్లు సర్పంచ్ సుజాత శ్రవణ్ దేశాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవికాలం దృష్టి లో భాగంగా అధికంగా కరెంట్ వినియోగం అవుతున్నందువలన గ్రామంలో ఒకే ట్రాన్స్ఫారం ఉండడంతో ఓవర్ లోడ్ వస్తున్నందున కారణంగా ఇంకొక్క ట్రాన్స్ఫార్మర్ని బిగించినట్లు తెలిపారు. గ్రామంలో ఇంకా ఏదైనా సమస్య ఉంటే తమ ముందుకు తీసుకురావాలని యువతీ యువకులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### అకాల వర్షం పడితే రైతులు నష్టపోతారు

### సర్పంచ్ కొండ రమేష్

**ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17, (జనంసాక్షి) :**




వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ శుక్రవారం ఉన్నత అధికారులకు, పాలకులను కోరారు. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు గత 15 రోజుల నుండి తరలిస్తున్నారని, అకాల వర్షాలు కురిసి రైతులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.ఎండ తీవ్రతలు పెరిగినందున రైతులు వడదెబ్బ తగిలి అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నందున వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఎక్కడ వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రాచర్ల గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అధికారులను కోరారు.

## చలివేంద్రము ప్రారంభించిన సర్పంచ్ అందె సుభాష్

**ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17, (జనంసాక్షి) :**

ఎల్లారెడ్డిపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం బస్టాండ్‌లో ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ అందె సుభాష్ చలివేంద్రమును ప్రారంభించారు. తీవ్రమైన ఎండలు కొడుతున్నటువంటి సందర్భంలో ప్రయాణించే ప్రయాణికుల కోసం బస్టాండ్ ఆవరణలో ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టాలని ఉద్దేశంతో ప్రజల దహార్తిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని సర్పంచ్ అందె సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జజ్జరి దేవేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల కార్మిక సంఘాలు నల్ల బ్యాడ్జీలతో ధర్నా కార్యక్రమం

**పెద్దపల్లి,ఏప్రిల్ 17(జనంసాక్షి) :**

తెలంగాణ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 206 ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర కేంద్ర జే ఏ సీ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ, డీఏ, పెండింగ్ బిల్లులు, పాత పెన్షన్ మొదలగునవి సాధన కొరకై కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ఉద్యోగులందరూ భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో ధర్నా కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ రిపోర్ట్ ని వెంటనే తెప్పించుకొని జూన్ 2వ తేదీ లోగా అమలుచేయాలని, నగదు రహిత ఆరోగ్య భద్రత కార్యక్రమంను మే 1 వ తేదీ నుండి ఎలాంటి నిబంధన లేకుండా అందరికీ వర్తిశీచేటట్లు నియమావళి తేవాలని, దీర్ఘ కాలంగా వేచివున్న బిల్లులను వెంటనే చెల్లించాలని, సీపీఎస్ ను రద్దు చేసి ఉద్యోగులందరికీ ఓపీఎస్ ను వర్తింప చేయాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా ఉద్యోగ సంఘాల జే.ఏ.సీ. ఛైర్మన్ ఉ పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల దీర్ఘకాల సమస్యల సాధన కొరకై రాష్ట్ర ఉద్యోగ జే ఏ సీ తలపెట్టిన ధర్నా కార్యక్రమం జిల్లా ఉద్యోగులందరూ హాజరుకావడం సంతోషకరంగా ఉందని, అన్ని సంఘాల నాయకులు ఒక్కతాటిపైకి వచ్చి పోరాడటం వల్ల ఉద్యోగుల సమస్యలు సత్వరంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని, ఈ నాలుగు ప్రధాన డిమాండ్లతో పాటు, ఉద్యోగుల అన్ని సమస్యలను సాధించుటకు ఈ ధర్నా తొలి మెట్టని, జే ఏ సీ అ పిలుపు ఇచ్చినా ఉద్యోగస్తులందరూ ఇలాగే కలిసి రావాలని, మన సమస్యలను సాధించుకునే వరకు ఈ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జే ఏ సీ సెక్రటరీ జనరల్ తూము రవీందర్,టీ జీ ఓ సంఘ బాధ్యులు రంగా రెడ్డి, కరుణాకర్, రవీందర్,గంప రవీందర్, బ్రహ్మానంద రెడ్డి, సాజిద్ అలీ, రవీంద్రనాథ్, ఉమాదేవి, టీఎన్జీఓ సంఘ బాధ్యులు ఆడెపు శ్రీనివాస్, ఎడ్ల కొమురయ్య, శ్రీధర్, అయిరెడ్డి సందీప్ రెడ్డి, అనిత,శిల్పా రెడ్డి, సౌమ్య, స్వప్న కుమారి,రమ్య,హారిక, దివ్య, మంగ,రాజమణి, ప్రవీణ్, రాజమహేందర్, గంగా రెడ్డి, హబీబ్ హుస్సేన్,రఫీక్, ప్రేమసాగర్, అరవింద్, శ్రీనివాస్, ప్రకాష్,శ్యామ్, ముస్తఫా,శ్రీకాంత్, రవితేజ,రాజయ్య, దేవేందర్,అంజి,అశోక్,ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు మెరుగు సతీష్, కాంపెల్లి లక్ష్మణ్,గుర్రం శ్రీనివాస్ గౌడ్,సంతోష్ కుమార్, కిషన్, కనకయ్య, పోచయ్య,అప్పాల అంజయ్య,జీగురు రవీందర్,కేతిపల్లి మహేందర్ రెడ్డి, అల్లెంకి సత్యనారాయణ,రవీందర్, పెన్షనర్ సంఘ భాధ్యులు జీవనరాజు,మల్లేశం,సమ్మి రెడ్డి,రామ్ రెడ్డి, రాజీ రెడ్డి,హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ గుడికందుల భాగ్యలక్ష్మి

**సుల్తానాబాద్,ఏప్రిల్ 17(జనంసాక్షి) :**

ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ఉపాధి హామీ కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు చేపట్టారు సాంబయ్య పల్లి సర్పంచ్ గుడి కందుల భాగ్యలక్ష్మి. శుక్రవారం మండలంలోని సాంబయ్య పల్లి గ్రామ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి తగు జాగ్రత్తల గురించి తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుడి కందుల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసే మహిళలు కాటన్ వస్త్రాలు ధరించాలని,తప్పకుండా నెత్తిపై కాటన్ టవలాలతో చుట్టుకోవాలని, గంటకు ఒకసారి మంచినీళ్లు త్రాగాలని సూచించారు. కచ్చితంగా మంచినీళ్ల బాటిల్స్, తో,పాటు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సర్పంచ్ గుడికందుల భాగ్యలక్ష్మి సూచించారు.ఏమైనా తల తిరుగుడు గాని ఇబ్బంది అనిపిస్తే ఫోన్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుడికందుల సంపత్ రెడ్డి తో పాటు ఉపాధి హామీ సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

## అలంగీర్ మస్జిద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన తహసిల్దార్ ఎండి బషీరుద్దీన్

**- చలివేంద్రాలు వేసవికాలంలో ప్రజలకు ఉపయోగపడతాయి**

**- అలంగిర్ మసీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయం**

**- తహసిల్దార్ ఎండి బషీరుద్దీన్**

**సుల్తానాబాద్,ఏప్రిల్ 17(జనంసాక్షి) :**

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసిన అలంగి ర్ మస్జిద్ కమిటీ సభ్యులను తహసిల్దార్ ఎండి బసిరుద్దీన్ అభినందించారు.మజీద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తహసిల్దార్ ఎండి బషీరుద్దీన్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఎండి బషీరోద్దీన్ మాట్లాడుతూ ఈ చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ పాదచారులు, ప్రయాణికులు, కార్మికులకు ఉచితంగా చల్లని తాగునీరు అందించడం,మండుతున్న ఎండలో ప్రజలకు ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా అబ్దుల్ హకీం మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుభూతి మానవతా భావాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ఆలంగీర్ మస్జిద్ ఆధ్వర్యంలో చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అలంగిర్ మజీద్ అధ్యక్షులు నదీమ్, ఇమామ్ నసార్, అలీ, మహా పుజ్, కమిటీ సభ్యులు, కలీం,రఫీఖ్ ,మసుద్, జావిద్,ఆసిఫ్ యువకులు, పాల్గొన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ప్రజలు అభినందనలు తెలిపారు.

## ఊర పెద్ద చెరువును సందర్శించిన మున్సిపల్ పాలకవర్గం

**సుల్తానాబాద్,ఏప్రిల్ 17(జనంసాక్షి) :**

మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు కానున్న ఊర పెద్ద చెరువును శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ కౌన్సిలర్లు, ఆర్ అండ్ బి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళికతో పాటు నిర్మాణ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ఊర పెద్ద చెరువును అధికారులతో కలిసి సందర్శించి నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.ఊర పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్,గానిర్మాణం చేయడానికి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు,ఎనిమిది కోట్ల 77 లక్షల రూపాయలు మంజూరు చేయించిన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, వర ప్రదీప్,తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డులో ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం

**సుల్తానాబాద్,ఏప్రిల్ 17(జనంసాక్షి) :**

మున్సిపల్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా (99 రోజుల యాక్షన్ ప్లాన్) 13వ వార్డులో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని, 13వ, వార్డు కౌన్సిలర్ సిద్ద తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు మున్సిపల్ ఛైర్మన్ బిరుదు రాధాకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ మాట్లాడుతూ ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా వివిధ వార్డులలో ఉన్నటువంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్నటువంటి ప్రతి సమస్యను పరిష్కారం చేయడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమని కమిషనర్ తిప్పరాజు రమేష్ స్పష్టం చేశారు. అన్ని వార్డులలో కనీస సౌకర్యాలతో పాటు అభివృద్ధి పనుల పై ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు,ఉట్ల వర ప్రదీప్, తొర్రి కొండ ప్రభాకర్, అమరిశెట్టి శ్రావణి రాకేష్, గాదాసు మంజుల రవీందర్,చింతల రాజు,గరిగె శోభారాణి శ్రీనివాస్,సిద్ధ తిరుపతి,కల్వల శంకరమ్మ ఓదెలు,కందునూరి సమత కుమార్, తోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

రోగులకు పరీక్షల ఫలితాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.హెచ్‌పీవీ టీకా కార్యక్రమంలో ప్రగతి తక్కువగా ఉన్నదని, గత నెలలో 800 మాత్రమే అందించారని తెలిపారు.రాబోయే రెండు నెలల్లో 6 వేల టీకాలు పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకుని ఆశా, ఏఎన్ఎం సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. 14--15 ఏళ్ల బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ నుండి రక్షణ పొందవచ్చని వివరించారు.తదుపరి ఒక నెలలో అన్ని అంగన్‌వాడీలను ఆర్బీఎస్‌కే బృందాలు సందర్శించి పిల్లల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, టిబి ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షలు చేపట్టి రోగులను గుర్తించి తగిన చికిత్స అందించాలని సూచించారు.అబార్షన్ ఆడిట్ తప్పనిసరిగా నిర్వహించాలని, అనధికార స్కానింగ్‌లను అరికట్టాలని ఆదేశించారు.గర్భిణీలకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమయానికి ఔషధాలు, పోషకాహారం అందేలా చూడాలని తెలిపారు. అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించి ప్రత్యేక సంరక్షణ అందించాలని, ఎక్కువ శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.డయాలిసిస్ రోగులకు నిరంతర చికిత్స సజావుగా అందేలా చూడాలని, ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో ఎక్కడా ధూళి, చెత్త లేకుండా శుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, డిసిహెచ్ ఓ డాక్టర్ శ్రీధర్, అదనపు వైద్యాధికారి వాణిశ్రీ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టాస్క్ సెంటర్ జాబ్ మేళా ద్వారా 62 మందికి ఉద్యోగాల

**- జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు**

**- టాస్క్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతం**

**పెద్దపల్లి,ఏప్రిల్ 17(జనంసాక్షి) :**



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టాస్క్ (టాస్క్) సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 380 మంది అభ్యర్థులు హాజరయ్యారని, అందులో 62 మంది ఎంపిక కాగా, మరో 9 మంది షార్ట్‌లిస్ట్ అయినట్లు పేర్కొన్నారు.

**కంపెనీ వారీగా ఎంపికైన అభ్యర్థులు :**

- జిపిఈ-- 14 మంది
- తేజ సొల్యూషన్ -- 16 మంది
- వై ఎస్ కే-- 26 మంది
- ఎయిర్టెల్ -- 6 మంది

షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు:

- వర్కర్స్ -4 మంది
- ఎయిర్టెల్-5 మంది

జాబ్ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని, ఇలాంటి కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ గంగా ప్రసాద్, సెంటర్ ఇంచార్జి కౌసల్య, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్స్, ఇతర కళాశాల ప్రతినిధుల, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోచమ్మ వాడ లో గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ యాదవ్ నూతన బోరు మోటర్ సరఫరా

**పెద్దపల్లి,ఏప్రిల్ 17 (జనంసాక్షి) :**



కమాన్పూర్ మండలం పెంచికల్ పేట్ గ్రామంలో 10 పదో వార్డులో పోచమ్మ గుడి వద్ద ఉన్న బోరు మోటర్ చెడిపోవడంతో వార్డు ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ యాదవ్ కు పరిస్థితి వివరించడంతో వెంటనే స్పందించి ఎలక్ట్రీషన్ అనవేన సతీష్ సహాయంతో బోరు మోటర్ బయటకు తీసి పరిశీలించగా మోటార్ చెడిపోయిందనీ ప్రస్తుత సర్పంచ్ మాధవి నూతన మోటర్ కొనుగోలు చేసి 24 గంటల్లో మోటార్ యధావిధిగా నడిపించి వార్డు ప్రజలకు నీరు సరఫరా అందేలా కృషి చేశారు.ఈ సందర్భంగా వార్డు ప్రజలు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ ఇరుగురాల శంకర్, పంచాయతీ సిబ్బంది అనవేన అనిల్,వార్డు ప్రజలు దాడి ఎల్లయ్య, సందెవెన సంతోష్,కమ్మటి సాయి,నర్సయ్య, శ్రీకాంత్,చిరంజీవి,తదితరులు పాల్గొన్నారు.